
ఒకాయన వచ్చాడు. మా ఊరు రాజధానిలో భాగమన్నాడు.
మానవ సంబంధాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి.
ఇంకొకాయన వచ్చాడు. రాజధాని ఇక్కడొక్కచోటే ఉండదన్నాడు.
మళ్లీ బోలెడు మార్పులు. ఈ నేపథ్యంలో మా బంధువొకాయన ఆత్మహత్య
నన్ను కదిలించింది. ఆ కదలికలోంచే ఈ కథ.


ఎమ్వీ రామిరెడ్డి

# 12

# త్రిశంకు నగరం

చారి పి.ఎస్.





పానకాలింట్లో పొద్దున్నే మళ్లీ మంటల్లేచాయి. మాటల్తో ఆ మంటలు రాజేసిన గంగమ్మ ఇంకా నిప్పులు కక్కుతూనే ఉంది. నిప్పుల వంక చూసే ధైర్యంలేని పానకాలు దిగాలుగా కూచొని ఉన్నాడు. ఆ సెగల ధాటికి పానకాలు భార్య మొహం మాడిపోయిన మొక్కజొన్న పొత్తులా అయింది.

పడమటి గదికే పరిమితమైపోయి, మాటల వేడిని బట్టి పరిస్థితి తీవ్రతను అంచనా వేస్తోంది పానకాలు కూతురు సుస్మిత. మెల్లగా శిథిలమవుతున్న ఆమె మనసు ఇప్పుడు ముక్కలై విరిగిపడుతోంది. వసారాలోకి వచ్చి అత్తను దులిపెయ్యాలన్న ఆవేశం ఆమెను నిలవ నియ్యటం లేదు. అలా చేస్తే తండ్రి ఒప్పుకోడని నిగ్రహం పాటిస్తోంది.

"ఇదుగో ఇదే సివరి రాక, సివరి మాట. మళ్లా నీ గడప తొక్కను; అల్లుడి కిస్తానన్న ఆస్తి ఇవ్వందే గడప దాటను," అని అరుగుమీద కూచుంటూ, "వచ్చి గంట దాటింది. మొహాన కాసిన్ని కాపీనీళ్లు పోసే దిక్కుగూడా లేదు," అంది నిష్ఠూరంగా.

పానకాలు భార్య వంటింటి వైపు పరుగు తీసింది.

పానకాలు పశువుల కొట్టంలోకి నడిచాడు. తాతల కాలం నుంచి ఇంటెనక ఆరు సెంట్ల, స్థలంలో ఉన్న కొట్టం అది. ధరలు ఆకాశంలో ఊరేగినప్పుడు 'కొట్టం అమ్ముతావా,' అని అడగని బేరగాడు లేడు. రెండు గేదెల ముందు మేతవేసి, పాలు పితికి ఇంట్లోకి నడిచాడు. భార్య ఎదురొచ్చి, పాలతపేళా అందుకుంటూ, "పిండి లేదండి. హోటలుకెళ్లి ఇడ్లీ తేకూడదూ," అంది.

పానకాలు బయటికి నడిచాడు. రెండిళ్లకవతల వ్యాను ఆగి ఉంది. దాన్నిండా ఇంటిసామగ్రి. ఇంకో పోర్షన్‌వాళ్లు కూడా ఖాళీ చేసినట్లున్నారు. వాహనం వెళ్లి పోయింది. సాంబయ్య వీథి అరుగు మీద దిగాలుగా కూచొని ఉన్నాడు.

పాతిక అడుగుల వెడల్పు కూడా లేని ఆ వీథిలో అయిదంతస్తుల భవనం కట్టాడు సాంబయ్య. చేతిలో డబ్బుండి చేసిన పని కాదు. అద్దెలకు జనం ఎగబడుతున్న రోజుల్లో బ్యాంకులు పిలిచి మరీ అప్పులిచ్చాయి. నెలనెలా వచ్చే అద్దె డబ్బుతో తేలిగ్గా వాయిదాలు కట్టెయ్యొచ్చని, భవనం మిగిలిపోతుందని లెక్క లేసుకున్నాడు. లెక్క

తప్పలేదు. పది పోర్షన్లూ కిటకిటలాడాయి. సాంబయ్య ఆకాశంలో నడిచాడు. హఠాత్తుగా పరిస్థితి తలకిందులైంది.

ఒక్కొక్కరే ఖాళీ చేశారు. కిస్తీలెట్లా కట్టాలో తెలియక సాంబయ్య సతమత మవుతున్నాడు.

ఆలోచన్లు మోసుకుంటూ సెంటరుకు చేరుకున్నాడు పానకాలు. ఒకప్పుడు రెండు మూడు కూల్‌డ్రింకు షాపులు, మూడు నాలుగు బడ్డీకొట్లు, నాలుగైదు బజ్జీ బండ్లు, ఒకే ఒక్క గుడిసె హోటల్‌తో బుద్ధుడి వదనంలా ప్రశాంతంగా కనిపించే నాలుగురోడ్ల ఆ కూడలి... ఇప్పుడు పంతం పట్టిన పంచనారసింహుడి విగ్రహంలా ఉంది.

మొన్నటిదాకా పది తలల కూర్పుతో రావణాసురుడి విశ్వరూపంలా ఉండేది. ఫ్యాన్సీ స్టోర్లూ, స్వీట్ షాపులూ, బేకరీలూ, పానీపూరీ బళ్లూ, మోడ్రన్ సెలూన్లూ, రెడీమేడ్ దుస్తులూ, బ్యూటీపార్లర్లూ... పచ్చి పల్లెటూరు నవ నగరంలా ముస్తాబైంది. రియల్ ఎస్టేట్ ఆఫీసులైతే, సందుకొకటి. ఉన్న పళంగా ఊడిపడిన 'అభివృద్ధి'కి మాంఛి కిక్కిచ్చేందుకు అయిదారు వైన్ షాపులు!

మస్తాన్ హోటల్ కిటకిటలాడుతోంది. జనం వెనక తన వంతు కోసం నిలబడ్డాడు పానకాలు. పొద్దున్నే లేవగానే రాత్రి మిగిలిపోయిన అన్నంలో పెరుగేసు కొని, కలుపుకొని తినే రోజులు అతని మదిలో మెదిలి, పెదవుల మీద నవ్వు మొలిచింది.

నాలుగు ప్లేట్లు ఇడ్లీ పార్శిల్ కట్టమని చెప్పి, పక్కకొచ్చి నిలబడ్డాడు.

"ఇదో పానకాలూ ఇట్టా రా," ఆ పక్కనే బండమీద కూచొని ఉన్న కిట్టారెడ్డి కేకేశాడు.

"నేనూ దోసెలు కట్టమన్నాలే. టైమ్ పట్టిద్ది, కూకో," అన్నాడు కిట్టారెడ్డి. బండ మీద కూచున్నాడు పానకాలు. చుట్టూ ఉన్న జనాన్ని పలకరిస్తూనే ఉన్నాడు కిట్టారెడ్డి.

"అరే కాసులూ, నీ వోటెల్ సంగతేందిరా! ఇంక మూతేసినట్టేనా?"

"ఆ బగమంతుడికే తెలియాల మామా." లక్షలు వెచ్చించి, అదే సెంటర్‌లో ఆధునిక హంగులతో రెస్టారెంటు పెట్టిన కాసులు మొహంలో నిరాశ తాండవించింది.

"ఖాదర్ భాయ్, నీ షాపు మళ్లా తెరిచేదుందా?"

"బీహార్ లేబర్ మళ్లా వచ్చేట్టు లేరు. ఏంజెయ్యాలో పాలుబోటంలేదు." అద్దాలు బిగించి మరీ హంగామా చేసి, బియ్యమూ కూరగాయలు అమ్మే షాపు ప్రారంభించిన ఖాదర్ పెదవి విరిచాడు.

"కిశోరూ! నీ ఫైనాన్సు కొట్టు తీసేసి, పిండిమరన్నా పెట్టుకోరా."

"ఎటకారంగా ఉంది బాబాయ్ నీకు. నీకేం, పొలం అమ్ముకున్నావ్. లచ్చ లొచ్చి పడ్డాయి. ఏ కబుర్లయినా చెబుతావ్," వ్యాపారంలో నిండా మునిగిన కిశోర్ బాధగా అన్నాడు.

“ఆ లచ్చుల కట్టలన్నీ ట్రాక్టరుకెత్తించి నీ ఇంటికి పంపిత్తాలే. మళ్లా మొదులు బెట్టు, వడ్డీ యాపారం. ముండా... అన్నాయం పనులు సెయ్యబాకురా,” గట్టిగానే మందలించాడు కిట్టారెడ్డి.

కిశోర్ తల దించుకుని, తుర్రుమన్నాడు.

“అరే ఎంకటేశూ, కుంటకాడ సేను దున్నినట్టుండావ్. ఏం ఏత్తన్నావేందీ?”

“మినుము పెట్టాలనుకుంటన్నా కిట్టన్నా.”

“నువ్వు మొనగాడివిరా, మళ్లా కల్లం సెయ్యబోతున్నావు.”

నవ్వుకుంటూ వెళ్లిపోయాడు వెంకటేశ్, చేతిలో టిఫిన్ పొట్లం ఊపుకుంటూ.

పానకాలు కిట్టారెడ్డి వంకే చూస్తున్నాడు. ఆరడుగుల పొడుగు. చెక్కలాంటి శరీరం. గట్టి మనిషి. ఆపకుండా పదెకరాలు దున్నేవాడు. ఎద్దుల్ని సైగల్తో కట్టడి చేసేవాడు. బండలాగుడు పోటీలు ఉన్నాయంటే, కటికెలోళ్ల ఎద్దుల పక్కన ఎద్దులా నిలబడేవాడు. ఇప్పుడు పిట్టలా అయిపొయ్యాడు. అరవై దాటకముందే వట్టిబోయిన పత్తిపొలంలా అయిపొయ్యాడు. హుషారు మాత్రం తగ్గలేదు.

మట్టసంగా గడ్డివాము వెయ్యటంలో కిట్టారెడ్డి దిట్ట. తను పైకి మోపు లందించేవాడు. ‘మీ ఇద్దరూ కలిత్తే వాము యమా వాటంగా వత్తదిరా,’ అని ఊరు ధ్రువీకరించింది. పుల్లలవాములైనా అంతే. గ్యాస్ పొయ్యిల్లేని కాలంలో పంటలై పోగానే పత్తికట్టె, మిరపకట్టె నరుక్కొని తెచ్చి, దొడ్లో వాములేసుకునేవాళ్లు. రోజూ కొద్దికొద్దిగా వంటకు వాడుకునేవాళ్లు.

రోడ్డుమీద బైకులూ కార్లూ పోతూనే ఉన్నాయి. మొన్నమొన్నటిదాకా భారీ లోడులారీలు, వ్యాపారుల కార్లు, పోలీసు జీపుల రాకపోకలతో ఆ రోడ్డు కిక్కిరిసి ఉండేది.

“ఏంది యవ్వారం పానకాలా! అమ్మాయి సంగతేం జేత్తన్నావు? పొద్దున్నే మళ్లా మీ యప్ప దిగడిందనుకుంటా,” బండమీంచి కాళ్లు కిందకి దించుతూ అడిగాడు కిట్టారెడ్డి.

“అవునన్నాయ్. ఏంజెయ్యాలో అర్థంగాటల్లా. ప్లాట్లు కూడా రాయక తప్పేట్టు లేదు,” నిస్పృహగా అన్నాడు పానకాలు.

“నేనంటే నోరేస్కొని బతుకుతన్నా. ఉండదంతా రాసేసి. వాయి లేనోళ్లు... నువ్వూ నీ పెళ్లాం ఏం తిని బతుకుతార్రా? అంతోటి మొగుడు ఉంటే ఎంత, ఊడితే ఎంత? పిల్ల బంగారం. ఎట్టాగైనా బతుకుద్ది,” కిట్టారెడ్డి గొంతులోనూ ఏదో దుఃఖం.

*

“ఇడ్లీ గట్టిగా ఉంది, చెట్నీ చెత్తగా ఉంది,” అంటూనే రెండు ప్లేట్లు లాగించేసి “ఏం పానకాలా! పొద్దుట్నించీ నేను లబలబ మొత్తుకుంటన్నా నీకు చీమ కుట్టి నట్టయినా లేదేంది?” అని మళ్లీ నట్టింట్లో పొగ పెట్టింది గంగమ్మ.

“ఇదిగో అప్పా, నిన్ను తేపతేపకీ తిప్పుకోటం నాకూ సెబ్బరిగానే ఉంది. శీను గాడిగ్గూడా ఫోన్జేశాను. మాపటేలకంతా వత్తాడు. మాట్లాడి, ఏదో ఒకటి చేద్దాం,” చెప్పాడు పానకాలు.

“ఏదో ఒకటా! నువ్వు సెయ్యగలిగింది ఒక్కటే ఉంది,” తనకేం కావాలో చెప్పింది గంగమ్మ.

“అన్నీ ఇచ్చేత్తే మేమెట్ల బతకాల?” ధైర్యం చేసి అడిగింది పానకాలు భార్య.

“ఈ ఇల్లుందిగా! ఇల్లూ కొట్టం కలిపి ఎయ్యి గజాల్దాకా ఉండదూ!” దీర్ఘం తీసింది గంగమ్మ.

పెంకుటింటి వంక ప్రేమగా చూసుకున్నాడు పానకాలు. డాబా కట్టాల్సిందే నంటూ అమ్మాకొడుకూ చెవినిల్లు కట్టుకొని పోరారు. తను ఒప్పుకోలేదు. కూతురు మద్దతు పలికింది.

గదిలోంచి సుస్మిత బయటికొచ్చింది. చీర కట్టి, ప్రత్యేకంగా తయారైనట్లు కనిపిస్తోంది.

“నాన్నా, నేను గుంటూరుదాకా వెళ్లొస్తాను,” వ్యానిటీ బ్యాగ్ చేతికి తగిలించుకుని, చెప్పులేసుకుంటూ చెప్పింది. పానకాలు వద్దనలేదు. వెళ్లిరమ్మనీ చెప్పలేదు. తలూపాడు, అంతే.

అత్త వైపు నిర్లక్ష్యంగా చూస్తూ బయటికి నడిచింది.

“బుద్ధుందా? ఈడొచ్చిన పిల్ల. పెళ్లయిన పిల్ల. టిక్కూ టిక్కూమంటూ ఊరేగ బోతంటే యాడికి బోతన్నావు, ఎందుకు బోతన్నావు అని అడిగే గ్యానం కూడా లేదా?” విరుచుకుపడింది గంగమ్మ.

ఆ ప్రశ్నలకు సమాధానాలు చాలా ఉన్నాయి పానకాలు దగ్గర. గుండెల్లో మరుగుతున్న ఆ జవాబుల్ని బుజ్జగించి బజ్జోపెట్టాడు.

అప్ప వంక ద్వేషంతో కూడిన చూపొకటి విసిరి, కండవా భుజాన వేస్కొని బయటికి నడిచాడు.

ఎందుకో కుంటకాడ చేను చూడాలనిపించింది. అటువైపు నడక మొదలు పెట్టాడు.

కూడలి నుంచి ఉత్తరానికి తిరగ్గానే, రోడ్డు పక్కన టెంటు కనిపించింది. యాభై మంది దాకా రైతులు కుర్చీల్లో కూచొని ఉన్నారు. కొందరు నల్లరిబ్బన్లు ధరించారు. ‘రాజధాని రైతుల నిరసనోద్యమానికి ఆరొందల యాభై రోజులు’ పూర్తయిన సందర్భంగా ప్రత్యేక బ్యానర్లు కట్టారు. మొదటివరసలో కూచొని ఉన్న నర్సయ్య ఎప్పట్లాగే పిలవటంతో, దగ్గరగా వెళ్లాడు పానకాలు.

“అరే పానకాలూ, గంటసేపన్నా కూకోరా. ఇప్పటికే శానా నష్టపోయాం. పోరాటం జెయ్యకపోతే మొత్తానికే మునిగిపోతాం,” అన్నాడు కుర్చీ చూపిస్తూ.

పానకాలు నవ్వి, నమస్కారం పెట్టి, వెళ్లిపోయాడు. నర్సయ్య అనేకసార్లు అట్లా అడగటం, పానకాలు నమస్కరించి వెళ్లిపోవటం రివాజుగా మారింది.

ఓ పర్లాంగు నడిచాడు. రోడ్డుకు కుడిపక్క మరో టెంటు; అందులోనూ కొందరు రైతులు. రాజధాని తరలింపునకు అనుకూలంగా వాళ్లు చేస్తున్న ఉద్యమాని క్కూడా మూడొందల రోజులు నిండాయి. దానికి సారథ్యం వహిస్తున్న మోహన్‌రావు టెంటు గుంజకు ఆనుకొని సిగరెట్టు కాలుస్తున్నాడు.

“కూలీ ఇచ్చి, కిరాయి మడుసుల్ని పెడితే అది పోరాటమవుతదా? ప్రభుత్వం భ్రెమలో ఉంది. చూస్తా ఉండండి, మా దెబ్బకు ఈల్లు టెంటు పీకెయ్యాల్సిందే, సర్కారు దిగిరావాల్సిందే,” ఆ శిబిరం వెలసిన తొలిరోజుల్లో కూడలిలో నిలబడి పెద్దగా అరిచాడు నర్సయ్య.

“సొంత లాభం కొంత మానుకొని ఆలోచించండి. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలి. రాజధాని తరలిపోయినంత మాత్రాన మన ప్రాంత అభివృద్ధి ఆగదు. మన పొలాలకు డిమాండు తగ్గదు,” ప్రెస్‌మీట్ పెట్టి సమాధానమిచ్చాడు మోహన్‌రావు.

ఇడ్లీ తిన్నా నీరసంగా అనిపించింది పానకాలుకు. గుంటూరు నుంచి సచివాలయం వైపు వెళ్లే బస్సెక్కి కుంటకాడ దిగి, చేలోకి నడిచాడు. చేన్నిండా పిచ్చి చెట్లు. అడవిలా తయారైంది. గట్టుమీదే పొలం చుట్టూ ఒకసారి తిరిగి, జమ్మిచెట్టు నీడలో కూచున్నాడు. కొమ్మల మధ్యలోంచి ప్రసారమవుతున్న వెలుగునీడలు అతణ్ని కాలప్రవాహంలో ముంచి తేలుస్తున్నాయి.

రాష్ట్రం విడిపోకముందే అయిదుగురు అన్నదమ్ములూ విడిపోయారు. అరెకరం పొలమూ అరలక్ష అప్పుతో మిగిలాడు పానకాలు. పొలం పనితప్ప వేరే విద్య తెలియదు. రాత్రింబవళ్లూ కష్టపడ్డాడు. తోటి రైతుల పొలాల్లో పనులకు వెళుతూనే, నాలుగెకరాలు కౌలుకు చేశాడు. నష్టాలు భరించాడు. విపత్తులు తట్టుకున్నాడు. భార్య అండగా నిలబడింది. అప్పు తీర్చుకున్నారు. కూడబెట్టుకున్న డబ్బుతో ఏడాదికో ఎకరం చొప్పున నాలుగున్నర ఎకరాల పొలం కొన్నారు. అయిదెకరాల ఆసామి అయ్యాడు. కొడుకునీ, కూతుర్నీ చదివించాడు.

తమ పిల్లలతోపాటు గంగమ్మ కొడుకు చదువుకీ సాయం చేశాడు. గంగమ్మ-పానకాలుకు పెదనాన్న కూతురు. చిన్న వయసులోనే భర్తను పోగొట్టుకుంది. గాలివాటు మనిషి. చదువుకు సాయం అందించినంత కాలం, ‘ఎవురికి బెడతన్నా వురా, నీ కూతురి కోసమేగా! తెలివిగా అల్లుణ్ని ముందే గాటికి కట్టేసుకుంటన్నావు,’

అని లౌక్యం పొయ్యేది. కొడుక్కి హైదరాబాదులో ఉద్యోగం రాగానే- ప్రకాశం జిల్లా నుంచి పదెకరాల కట్నమిస్తామన్న కబురు రాగానే అటువైపు మొగ్గింది.

మంచి ముహూర్తాల్లేవని ఆగిందిగానీ, లేకుంటే లగ్నపత్రిక రాయించేదే.

అనూహ్యంగా అమరావతి రాజధాని అయ్యింది. ఆ ఊరు రాజధాని పరిధిలో చేరింది. పది లక్షలు కూడా పలకని పొలం రాత్రికి రాత్రే కోటికి పడగలెత్తింది. గంగమ్మ ప్లేటు ఫిరాయించింది.

"ఎంత ఆదుకున్నావయ్యా! వాడి చదువుకు ఎంత సాయం జేశావు! ఈ బొందిలో ఊపిరుండగా నీ కూతుర్ని కాదని ఇంకొకత్తెను చేస్కోనిత్తానూ!" అని ఇంటి దగ్గరే మకాం వేసింది.

ఆమె బుద్ధి తెలిసినా, కూతురు ఇష్టపడిందన్న కారణంతో పెళ్లికి ఒప్పుకొన్నాడు పానకాలు. రెండెకరాలు పిల్లపేర పెడతానని హామీ ఇచ్చాడు. రెండు కోట్లు మనసులో కళకళలాడటంతో గంగమ్మ ఆనందంగా సుస్మితను కోడలిగా స్వీకరించింది. హైదరాబాదులో కాపురం పెట్టాక, పట్టుబట్టి మరీ పొలాన్ని కోడలి పేరు మీద రిజిస్టర్ చేయించుకుంది.

'కోటి మీద బేరం నడుస్తంది. సుబ్బరంగా రెండెకరాలూ అమ్మేస్కోని, ఇంకెక్కడైనా పదెకరాల పొలమూ హైద్రాబాదులో మూడు గదుల ఇల్లూ కొనుక్కో,'మని తను మొత్తుకున్నాడు.

'అది ఎకరం మూణ్నాలుగు కోట్లకు పెరిగిద్దిరా దద్దమ్మా. అమ్ముకోటం పిచ్చి పని,' అందామె.

పానకాలుకున్న మరో రెండెకరాలు భూసేకరణలో పోయింది. పరిహారంగా ప్రభుత్వం ప్లాట్లు కేటాయిస్తానంది. పంటలు వెయ్యొద్దని ఆదేశించింది. దాదాపు ముప్పై అయిదు వేల ఎకరాల భూమి విత్తనాల పలకరింపునకు నోచుకోక పిచ్చి మొక్కలకు ఆనవాళ్లుగా మిగిలింది.

సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన కొడుకు పోరు భరించలేక మిగిలున్న ఎకరాన్ని కోటి రూపాయలకు అమ్మాడు. కొన్ని బాకీలుంటే తీర్చాడు. మిగతా డబ్బుతో కొడుకు కారు కొని, అపార్టుమెంటు కట్టే వ్యాపారం మొదలుపెట్టాడు. తాడేపల్లి దగ్గర్లో భారీ ధర చెల్లించి, కొన్న స్థలంలో అయిదంతస్తుల అపార్టుమెంటు దాదాపు పూర్తి కావచ్చింది. సగం ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. అప్పట్లో ఉన్న డిమాండు ప్రకారం గాల్లో లెక్కలు వేసి హీనపక్షం కోటి మిగులుతుందని అంచనా కట్టాడు.

ప్రభుత్వం మారింది. రాజధాని మూడు ముక్కలైంది. అంచనాలన్నీ వేల ముక్కలయ్యాయి.

'హైదరాబాదు బిర్యానీ' పాచిదైపోయింది. స్వీట్‌షాపులు చేదెక్కాయి. పొలాలూ స్థలాలూ రెక్కలు తెగి నేల వాలాయి. కార్లు మొహం చాటేశాయి. రియల్ ఎస్టేట్ బోర్డులు దుమ్ము పట్టాయి.

"నువ్వు రెండు కోట్లు ముట్టజెబుతానన్నావు. ఇప్పుడు ఎకరం యాభై లచ్చలు కూడా లేదు. అంటే కోటి నష్టం. గవర్మెంటుకిచ్చిన రెండెకరాలగ్గానూ స్థలాలు కేటాయించారుగా. ఆటిని నా కొడుకు పేర రాయి," అంటూ గంగమ్మ గత సంవత్సర కాలంగా పోరుపెడుతోంది.

కొడుకు కట్టిన అపార్టుమెంటులో కొత్తగా ఒక్క బుకింగూ లేదు. పైగా అడ్వాన్స్ ఇచ్చినవాళ్లు తిరిగిచ్చెయ్యమని బలవంతం చేస్తున్నారు. ఆ వ్యాపారం మీద పెట్టిన కోటిని ఎట్లా వెనక్కి తియ్యాలో తెలియక, కొడుకు విశాఖపట్నం పారిపొయ్యాడు. జీవిక కోసం అంగలారుస్తున్నాడు.

ఇప్పుడు గంగమ్మ పీకల మీద కూచ్చుంది. ఏం చెయ్యాలి?

ఆలోచనలకు తలలో నరాలు చిట్లిపోతున్నట్లు అనిపించింది పానకాలుకు.

తలెత్తి ఆకాశం వంక చూశాడు. రెండు చేతులూ పైకెత్తి పెద్దగా అరిచాడు...

"ఓ పానకాల సామీ! మేం అడిగామా రాజధాని కావాలని? మేం అడిగామా ఈడనించి తీస్కెళ్లిపొమ్మని? ఏందీ ఈ దాగుడుమూతలు! ఎందుకీ దొంగాటలు!"

*

ఉప్పెనలాంటి వార్తతో ఊరంతా నిద్రలేచింది.

పున్నమి చెరువు దగ్గరికి జనం పరుగులు తీశారు. పానకాలూ చేరుకున్నాడు.

చెరువొడ్డున రావిచెట్టు కొమ్మకు కట్టిన ఎడ్లపగ్గాలకు కిట్టారెడ్డి నిర్జీవంగా వేలాడుతున్నాడు.

కిట్టారెడ్డి భార్యాపిల్లలు గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్నారు.

పోస్టుమార్టం పూర్తయితేనే శవాన్ని అప్పగిస్తామంటున్నారు పోలీసులు.

"పొలం అమ్మగా వచ్చిన నలభై లక్షలు బంధువొకాయనకు అప్పుగా ఇచ్చాడంట. ఆడేదో చిట్టీల యాపారం పెట్టి, అందరినీ ముంచాడంట. ఈయనకీ మొండి చెయ్యి చూపిచ్చాడంట..." ఎవరో చెబుతున్నారు. అక్కడ చేరిన జనం నోట విభిన్న కథనాలు.

నిన్న టిఫిన్ సెంటర్ దగ్గర కిట్టారెడ్డి పలకరింపులూ పరాచికాలూ గుర్తొచ్చాయి పానకాలుకు.

'మోసం చేశావు కిట్టారెడ్డీ. నోరేస్కోని బతుకుతానన్నావు... సిగ్గులేదూ సచ్చిపోటానికి!' పానకాలు మనసు మూగగా రోదిస్తోంది.

"ఏం పానకాలు మావా? ఎట్టా ఉండావ్?" అక్కడికొచ్చిన దేవదానం పలకరించాడు. అతని మాట ముద్దగా ఉంది. కొద్దిగా తూలుతున్నాడు.

దేవదానానికి సెంటుభూమి లేదు. ఎలాంటి పనినైనా కళాత్మకంగా చెయ్యగల సాధకుడు. భుక్తికి ఢోకాలేదు. రాజధాని మోజు జనాన్ని కుదిపేస్తున్న వేళ... పొలాల క్రయవిక్రయాల్లో మునిగితేలాడు. చేతుల్లో డబ్బు తిరిగింది. అలవాట్లు చుట్టుముట్టాయి. ఇప్పుడు అలవాట్లు మాత్రమే మిగిలాయి.

"పొద్దున్నే మొదులుబెట్టావా? తింటానికి గింజల్లేవుగానీ, తాగటానికి మందు గావాల్నా?"

"ఇంకెన్నాళ్లు మావా! ఇయ్యాల కిట్టారెడ్డీ, రేపు దేవదానం, ఎల్లుండి పానకాలు... ఒకరోజు అటో ఇటో, అంతే. ఉండన్నాళ్లయినా మజా చేస్కోవాల..." వేదాంతం మాట్లాడాడు దేవదానం.

పానకాలు మౌనంగా ఇంటి ముఖం పట్టాడు. అతని కళ్లముందు...

నెత్తిన అయిదంతస్తుల బరువుతో సాంబయ్య, మెడలో రెస్టారెంటు అనబడే గుదిబండతో కాసులు, కూరగాయల గాయాలతో ఖాదర్, డబ్బునోట్ల ఊబిలో కూరుకుపోయిన కిశోర్, నిండా అప్పులపాలైన కొడుకు... లీలగా కదలబారుతున్నారు.

వెంకటేశ్‌లా ఒకరో ఇద్దరో మళ్లీ మట్టితో జట్టు కడుతూ కొత్త ఆశలు రేకెత్తిస్తున్నారు.

ఇంటికి చేరుకున్నాడు పానకాలు.

రాత్రి పొద్దుపోయి వచ్చిన కొడుకు ఆలస్యంగా నిద్ర లేచాడు. అల్లుడు కూడా పొద్దున్నే దిగాడు.

అప్ప ఫోన్జేసి, రమ్మని ఆజ్ఞ వేసి ఉంటుందని ఊహించాడు పానకాలు.

టిఫిన్లు కానిచ్చి, అందరూ ఒకచోట చేరారు. చర్చలు మొదలయ్యాయి.

ప్లాట్లు తన కొడుకు పేర రాయటం మినహా మరే మధ్యేమార్గానికీ గంగమ్మ ఒప్పుకోలేదు.

నిజానికా ప్లాట్లు సర్కారు ఎక్కడ కేటాయించిందో పానకాలుకే తెలియదు. వాటి తాలూకు పత్రాలు కూడా ప్రశ్నార్థకమే.

చివరికి... పానకాలు, అతని భార్య, కొడుకు అందుకు అంగీకరించారు.

సుస్మిత అడ్డం తిరిగింది. "మీ అమ్మ సంగతి వదిలెయ్యండి, మీరు చెప్పండి. మీకు నేను కావాలా? నా ఆస్తులు కావాలా?" అంటూ భర్తను నిలదీసింది.

అతగాడు తలొంచుకుని నిలబడ్డాడు.

"మాట్లాడరేం? ప్లాట్లు మీ పేర రాయరు. నా పేరుమీద రాస్తారు. అయితే, నాదో కండిషన్. మీ అమ్మ మనతో ఉంటానికి వీల్లేదు," కరాఖండిగా చెప్పింది సుస్మిత, భర్త కళ్లల్లోకి చూస్తూ.

"ఏందే ఈ నాటకాలు..." అంటూ పట్టలేని కోపంతో తన పక్కనే ఉన్న ఇత్తడి బిందెను చేతి సత్తువకొద్దీ విసిరికొట్టింది గంగమ్మ. అది గోడకు తగిలి, అదే వేగంతో వెనక్కి వచ్చి, పానకాలు తలకు బలంగా తాకింది. అతను కుప్పకూలిపోయాడు.

*

సుస్మిత దగ్గరుండి, తండ్రిని చూసుకుంది.

రెండురోజుల తర్వాత పానకాలును ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

ఇంటికి చేరుకున్నాక, తండ్రిని మంచంలో పడుకోబెట్టి, పక్కనే కూచుందామె.

"నాన్నా. ఆస్తులు చరమే తప్ప స్థిరం కాదు. ఇంకో రెండెకరాలు ముట్టజెప్పి, నన్నా ఇంటికి పంపించగలరు. కానీ, నాకు కష్టం వచ్చినప్పుడు రెండు కన్నీటిబొట్లు రాల్చలేని కర్కోటకుల మధ్య ఎట్లా బతకమంటారు? తల్లిమాట తప్ప తనలో సగాన్ని గౌరవించలేని మనిషి నాకక్కర్లేదు. నేను గుంటూరులో జాబ్ చూసుకున్నాను. నా కాళ్లమీద నేను బతగ్గలను. రేపే అతనికి విడాకుల నోటీసు పంపబోతున్నాను," నిక్కచ్చిగా చెప్పి, వెళ్లిపోతున్న సుస్మిత వంక ఆశ్చర్యంగా చూస్తూండిపోయింది తల్లి.

*

మూడు రోజుల తర్వాత... ఉదయం పది గంటల ప్రాంతంలో పానకాలు కూడలి దగ్గరకు చేరు కున్నాడు.

ఉత్తరానికి తిరిగి సచివాలయానికి వెళ్లే రోడ్డు పక్కనే ఉన్న టెంటు దగ్గర ఆగాడు. పేపరు చదువుతున్న నర్సయ్య పానకాలును చూసి, ఏదో అనబోయి, ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

పానకాలు ఒక్క నిమిషం రోడ్డు మీద నిలబడి, గబగబా శిబిరంలోకి నడిచి, నర్సయ్య పక్కనే కూచున్నాడు.

*ఆంధ్రజ్యోతి ఆదివారం*
*17 అక్టోబర్ 2021*

*




ఎమ్వీ **రామిరెడ్డి** పూర్తి పేరు ముువ్వా వెంకటరామిరెడ్డి. 7 ఫిబ్రవరి 1970న గుంటూరు జిల్లా పెదపరిమిలో జన్మించారు. మొదటి కథ ***గోల్డ్ మెడల్*** 1993లో అమెరికా తెలుగు సంఘం (ఆటా) సావనీర్ స్రవంతిలో అచ్చయింది. నాలుగు కవితాసంపుటాలు, వెన్నలో లావా, వెంట వచ్చునది, స్పర్శవేది కథాసంపుటాలు ప్రచురించారు. 'ముువ్వా చిన బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు' తరపున వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రామ్‌కీ ఫౌండేషన్ ప్రెసిడెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు.

**చిరునామా:** **ఫ్లాట్ నెం. 904, రామ్‌కీ 1 గెలాక్సియా, ఎ బ్లాక్, నల్లగండ్ల, హైదరాబాద్ - 500 049**
***ఫోన్: 98667 77870*** **muvvaramu@gmail.com**